క్లుప్తంగా

పరామర్శ



భువన కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న శత్రుచర్ల పరీక్షిత్‌రాజు

జియ్యమ్మవలస: మండలంలోని శిఖబడి గ్రామానికి చెందిన యర్ర భువన ఇటీవల మరణించడంతో ఆమె కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు బుధవారం పరామర్శించారు. భువన తండ్రి యర్ర కృష్ణ మూర్తినాయుడును ఓదార్చారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట సర్పంచ్ కోట రమేష్, మండల కన్వీనర్ మూడడ్ల గౌరీశంకరరావు, డీసీసీబీ డైరెక్టర్ లోలుగు నారాయణరావు, గంట జగన్నాథంనాయుడు, మరడాన కిశోర్ ఉన్నారు.

అంగన్‌వాడీల ర్యాలీ



తహసీల్దార్ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు

పాలకొండ రూరల్: తమ డిమాండ్లు నెరవేర్చాలంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు బుధవారం పాలకొండలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక కోటదుర్గమ్మ దేవస్థానం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు ఎస్.హిమప్రభ, బి.అమరవేణి, సీఐటీయూ జిల్లా నాయకులు డి.రమణారావు, జి.జెస్సీ బాయి, ఆర్.భవాని తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా ఆడుదాం.. ఆంధ్రా పోటీలు



బాలేరులో వలంటీర్లకు ఆటల బాధ్యతలు అప్పగిస్తున్న అధికారులు

భామిని: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం.. ఆంధ్రా క్రీడా పోటీలను సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు సమష్టిగా సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీఓ జె.ఉమామహేశ్వరి సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో కార్యదర్శులు, పీడీలు, వలంటీర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. గుర్తించిన క్రీడా మైదానాల్లో ఐదు రకాల పోటీలు చేపట్టాలని, 12 రోజులు సందడిగా కొనసాగించాలన్నారు. బాలేరు సచివాలయం పరిధిలో వలంటీర్లకు బాధ్యతలు అప్పగించి క్రీడా మైదానం పనులు పరిశీలించారు.

ఓటు వజ్రాయుధం



ఓటుపై అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు

కొమరాడ: ప్రజాస్వామ్య దేశంలో ఓటు ఓ వజ్రాయుధమని స్థానిక జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు అన్నారు. కళాశాలలో ఓటు హక్కుపై విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని సూచించారు. ఓటు ద్వారా మంచి నేతను ఎన్నుకోవచ్చన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శబరిమలకు స్వాములు పయనం



వీరఘట్టం నుంచి శబరిమలకు బయలుదేరిన అయ్యప్పస్వామి భక్తులు

వీరఘట్టం: విల్లాలి వీరుడు వీరమణికంఠుడు... స్వామియే శరణమయ్యప్పా అంటూ శరణుఘోష చేస్తూ సాయినగర్ కాలనీ సమీపంలో ఉన్న శాస్తా సమాజానికి చెందిన 40 మంది అయ్యప్ప భక్తులు బుధవారం ఇరుముడులు ధరించి శబరిమలకు బయలుదేరారు. గత 41 రోజులుగా దీక్షలు చేపట్టిన వీరికి వీరఘట్టం మండలం నడిమికెల్లకు చెందిన పొందూరు రాంబాబు గురుస్వామి ఇరుముడులు కట్టారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో అయ్యప్ప భక్తులు శబరిమలకు పయనమయ్యారు



పాలకొండ రూరల్: వాటపాగులో ప్రజలకు ప్రభుత్వం అందించిన సంక్షేమం లబ్ధి వివరిస్తున్న బోర్డును అవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు



గుమ్మలక్ష్మీపురం: జర్నలో సంక్షేమ పథకాల డిస్‌ప్లేను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ కుంబురుక దీనమయ్య, పార్టీ శ్రేణులు

సీఎం జగన్‌తోనే రాష్ట్ర అభివృద్ధి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందని పలువురు ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. బుధవారం పలుచోట్ల వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో ఉందన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన ఉందన్నారు. మున్ముందు మరింత సంక్షేమం, అభివృద్ధి పనులు జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమన్నారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అధికారులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



కొమరాడ: పాలేం సచివాలయం వద్ద సంక్షేమ పథకాల డ్యాష్ బోర్డు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



సీతంపేట: కడగండి గ్రామ సచివాలయం పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



వీరఘట్టం: సంత-నర్సిపురంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో నాలుగున్నరేళ్లుగా గ్రామంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలను డిజిటల్ బోర్డుపై ప్రదర్శిస్తున్న ఎంపీపీ దమలపాటి, వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు



జియ్యమ్మవలస: కొండచిలకాంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుల ర్యాలీ

రహదారి నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ



బీటీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని డొంగరికిక్కువ గ్రామానికి బీటీ రోడ్డు సౌకర్యం కల్పించేందుకు కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి బుధవారం కంబగూడ గ్రామంలో భూమి పూజ చేశారు. దుడ్డుఖల్లు పంచాయతీ కంబగూడ నుంచి నెల్లికిక్కువ పంచాయతీ డొంగరికిక్కువ గ్రామానికి గల 1.50 కిలోమీటర్లలో బీటీ రోడ్డు నిర్మాణానికి ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.50 లక్షలు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రాధాన్యతా క్రమంలో గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. రోడ్డు నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేసి ఈ ప్రాంత గిరిజన ప్రజలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని గిరిజన సంక్షేమ ఇంజనీరింగు శాఖ అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. తమ గ్రామానికి రోడ్డు నిర్మాణం ఎప్పుడెప్పుడు జరుగుతుందా అని ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్నామని, ఎమ్మెల్యే చొరవతో ఎట్టకేలకు రోడ్డు నిర్మాణం జరుగుతుండటం పట్ల డొంగరికిక్కువ గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కుంబురుక దీనమయ్య, జెడ్పీటీసీ మండంగి రాధిక, వైస్ ఎంపీపీ నిమ్మక లక్ష్మణరావు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

అవగాహనతో ప్రమాదాలకు అడ్డుకట్ట



అగ్ని ప్రమాదాల నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

పాలకొండ రూరల్: అవగాహనతో అగ్ని ప్రమాదాలను అధిగమించాలని సంబంధిత శాఖ ఎస్ఐ జామి సర్వేశ్వరరావు అన్నారు. పాలకొండ ఆర్‌సీఎం పాఠశాలలో బుధవారం ప్రత్యేక డెమో ద్వారా ప్రమాదాల నివారణ, ముందస్తు జాగ్రత్త చర్యలపై అవగాహన కల్పించారు. భవన సముదాయాల్లో, గ్రామీణ ప్రాంతాల్లో చోటుచేసుకునే అగ్ని ప్రమాదాలను నిలువరించేందుకు శాఖా పరంగా చేపట్టే చర్యలు, వినియోగించే పరికరాల వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు తెలుసుకున్న అంశాలను తమ ఇంటి వద్ద పెద్దలు, సహచరులతో పంచుకోవాలన్నారు. సమస్యలు తలెత్తితే 100 నంబరుకు సమాచారం అందించాలన్నారు.

ఆర్ఐటీఐలో భారతీయ భాషా ఉత్సవ్

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి ప్రభుత్వ ఆర్ఐటీఐలో ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్‌కుమార్ బుధవారం భారతీయ భాషా ఉత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులచే తెలుగు భాష యొక్క ప్రాధాన్యతపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మహా కవి సుబ్రహ్మణ్య భారతి జయంతిని పురస్కరించుకుని భారత విద్యా మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు భారతీయ భాషా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ప్రిన్సిపాల్

మిశ్రమ పంటల సాగు బాగు



రాయగడజమ్ములో పంటలను పరిశీలిస్తున్న అనూప్‌కుమార్

గుమ్మలక్ష్మీపురం: మిశ్రమ పంటల సాగు రైతులకు ప్రయోజనకరమని రైతు సాధికార సంస్థ (గుంటూరు) అధ్యాయన కర్త అనూప్‌కుమార్ అన్నారు. జట్టు ట్రస్ట్ ద్వారా గొరడ, రాయగడ జమ్ము గ్రామాల్లోని రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేస్తున్న మిశ్రమ పంటలను బుధవారం ఆయన పరిశీలించారు. గొరడ గ్రామానికి చెందిన తాడంగి బంగర్రాజు అనే రైతు సుమారు 50 రకాల పంటల సాగుతో పాటు నాటు కోళ్లు, కుందేళ్ల పెంపకం చేపడుతూ ఆదాయం పొందుతున్న తీరును పరిశీలించి అభినందించారు. ఒకే రకం పంటలు కాకుండా పలు రకాల పంటలను మిశ్రమ పంటలుగా సాగు చేసుకోవడం వలన ఎంతో ప్రయోజనం కలుగుతుందని రైతులకు వివరించారు. ఆయన వెంట జట్టు ట్రస్టు బడి నుంచి పొలం బడికి గేయాల అనువాదకురాలు పూజిత, కో డైరెక్టర్ నూకంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నందివానివలసలో పంటకోత ప్రయోగం

గరుగుబిల్లి: మండలంలోని నందివానివలస గ్రామంలో గోళ్ల అన్నపూర్ణ రైతు క్షేత్రంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాధించిన దిగుబడులను లెక్కించేందుకు బుధవారం పంట కోత ప్రయోగం నిర్వహించారు. కేవీకే శాస్త్రవేత్త అమృతవీణ సారథ్యంలో పంట కోత ప్రయోగం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా ప్రకృతితో పాటు సకల జీవరాశులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. భూమికి మేలు చేసే సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రకృతి వ్యవసాయం అధికారి డీపీఎం షణ్ముఖరాజు, ఎన్ఎఫ్ఏ జి.అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్త అమృతవీణ

ఘనంగా పోలిపాడ్యమి పూజలు



పాలకొండ రూరల్: మంగళాపురం శివాలయంలో అన్నదానం

పాలకొండ: పోలిపాడ్యమి సందర్భంగా బుధవారం పట్టణంలోని శివాలయాల్లో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక భీమ లింగేశ్వర స్వామి ఆలయం వద్ద వేల మందికి అన్న సమారాధన చేపట్టారు. పట్టణంలోని కాశీవిశ్వేశ్వర స్వామి, కొండాపురం శివాలయాల్లో అన్న సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక దీక్షలు చేపట్టిన వారు పాడ్యమితో దీక్షలు విరమించారు.

జియ్యమ్మవలసలో..

జియ్యమ్మవలస: మండలంలోని అన్ని గ్రామాలలో బుధవారం పోలిపాడ్యమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నదీ స్నానానికి వెళ్లిన మహిళలు దీపాలు వెలిగించి తెప్పలతో విడిచిపెట్టారు. బిత్రపాడు, అల్లువాడ, వెంకటరాజపురం, జియ్యమ్మవలస,చినమేరంగి తదితర గ్రామాలలో పూలపాడ్యమి వేడుకలు జరుపుకున్నారు.



పాలకొండ: ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు

పాలకొండలో..

పాలకొండ రూరల్: పవిత్ర కార్తీకమాసం పూర్తవటంతో భక్తులు శివాలయాలకు బుధవారం పోటెత్తారు. ఈ క్రమంలో పోలిపాడ్యమిని పురస్కరించుకుని మండలంలో చిన్నమంగళాపురం, యరకారాయపురం, తుమరాడ తదితర ప్రాంతాలతో పాటు స్థానిక కాశీవిశ్వనాథ, సనారీ విశ్వనాథ ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమాలను చేపట్టారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

జియ్యమ్మవలస:

మండలంలోని చినమేరంగి పీఏసీఎస్‌లో వైఎస్సార్‌సీపీ మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు ఈ కేంద్రాన్ని వినియోగించుకోవాలన్నారు. కామన్ రకం క్వింటాళ్లు రూ.2183, గ్రేడ్ ఏ రకం రూ.2203లుగా ప్రభుత్వం నిర్ణయించిందని రైతులు గమనించాలన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు తాడేల మన్మధనాయుడు, కన్వీనర్ గౌరీశంకరరావు, సీతఊట బొత్స రామారావునాయుడు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న పరీక్షిత్‌రాజు

బెల్లం ఊట ధ్వంసం

కురుపాం: మండలంలోని పొడి పంచాయతీ భారతంగి గ్రామ సమీపంలో బుధవారం ముందస్తు సమాచారం మేరకు సెబ్ ఎస్ఐ బి.వి.నాగభూషణరావు తన సిబ్బందితో సారా తయారీ స్థావరాలపై దాడులు చేశారు. సెబ్ ఎస్ఐ వివరాలు వెల్లడించారు. భారతంగి గ్రామ పరిసరాల్లో దాడులు చేపట్టగా సారా తయారీ కోసం నిల్వ ఉంచిన 1100 లీటర్ల పులిసిన బెల్లం ఊట, వంటకాలకు ఉపయోగించే సామగ్రితో పాటు 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. బెల్లం ఊటను ధ్వంసం చేశామని తెలిపారు. సారా వంటకాలు చేస్తున్న భూర్జిమానుగూడ గ్రామానికి చెందిన కూరంగి బుడ్డయ్య, పొడి గ్రామానికి చెందిన ఆరిక సుగ్రీవులు సెబ్ సిబ్బందిని చూసి పరారైనట్టు తెలిపారు. దాడుల్లో ఎస్ఐ ఎం.ప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ రాముడు, సిబ్బంది పాల్గొన్నట్టు తెలిపారు.



దాడుల్లో స్వాధీనం చేసుకున్న సారా తయారీ సామగ్రి

గ్రామీణ తపాలా ఉద్యోగుల నిరవధిక సమ్మె

గుమ్మలక్ష్మీపురం: దేశ వ్యాప్త నిరవధిక సమ్మెలో భాగంగా తమ డిమాండ్లు పరిష్కరించే వరకు (సమ్మె కాలం ముగిసే వరకు) తపాలా శాఖ లావాదేవీలు నిలిపివేస్తున్నట్టు గుమ్మలక్ష్మీపురం, మొండెంఖల్లు ఎస్వోలకు చెందిన గ్రామీణ తపాలా ఉద్యోగులు పేర్కొన్నారు. ఈ మేరకు గుమ్మలక్ష్మీపురం పోస్టాఫీసు వద్ద వారంతా బుధవారం నిరవధిక సమ్మె చేశారు. ఈ సందర్భంగా జీడీఎస్ ఉద్యోగులు అధికారి జయంత్‌రావు, వెంకటరావు, చిన్నంనాయుడు తదితరులు మాట్లాడుతూ తపాలా శాఖపై కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరి నశించాలని నినాదాలు చేశారు. 8 గంటలు పని కల్పించాలని, లక్ష్యాల పేరుతో వేధించడం ఆపాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ రూ.5 లక్షలకు పెంచాలని గ్రాట్యూటీ కూడా రూ.5 లక్షలకు పెంచాలని, సివిల్ సర్వెంట్ హోదా ఇవ్వాలని డిమాండ్ చేశారు.



గుమ్మలక్ష్మీపురం పోస్టాఫీసులో నిరవధిక సమ్మె చేస్తున్న గ్రామీణ తపాలా శాఖ ఉద్యోగులు

పశు పోషణలో మెలకువలు పాటించాలి : ఏడీ

పాలకొండ: పాడి రైతులు పశు పోషణలో మెలకువలు పాటించాలని పశు సంవర్ధక శాఖ ఏడీ పి.మాణిక్యాలరావు సూచించారు. మండలంలోని కొండాపురం గ్రామంలోని రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు పశు విజ్ఞాన బడి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పశు పోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. పాడి రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని వివరించారు. ప్రస్తుతం సీజన్‌లో పాల దిగుబడి కోసం నాణ్యమైన ఆహారం అందించాలని తెలిపారు. ఆయనతో పాటు గ్రామ వెటర్నటీ అసిస్టెంట్ వెంకటరమణ ఉన్నారు. పశు విజ్ఞాన బడి పుస్తకాలను రైతులకు అందించారు.



రైతులకు పశువిజ్ఞాన బడి పుస్తకాలు అందిస్తున్న ఏడీ మాణిక్యాలరావు

దోనుబాయి ఆశ్రమ పాఠశాల సందర్శన

సీతంపేట: మండలంలోని దోనుబాయి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను ఐటీడీఏ ఏపీఓ వై.రోసిరెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వండుతున్న మెనూ పరిశీలించారు. రుచికరంగా వండాలన్నారు. అనంతరం విద్యార్థుల యోగక్షేమాలు తెలుసుకున్నారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థులు ఎలా చదువుతున్నారో తెలుసుకున్నారు. టెన్త్ క్లాస్ విద్యార్థులను వివిధ సబ్జెక్టులకు సంబంధించిన ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కొండగొర్రె సుబ్బారావు పాల్గొన్నారు.



విద్యార్థులకు వండిన పదార్థాలు పరిశీలిస్తున్న ఏపీఓ రోసిరెడ్డి

జీతాల కోసం వినతి

కురుపాం: మండలంలోని పలు పంచాయతీలల్లో గ్రీన్ అంబాసిడర్స్‌గా పని చేస్తున్న వారికి పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే చెల్లించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో కురుపాం ఎంపీడీఓ రమేష్‌బాబుకు బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రీన్ అంబాసిడర్స్ మాట్లాడుతూ జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నామని అధికారులు స్పందించి జీతాలు చెల్లించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో గ్రీన్ అంబాసిడర్స్, సీఐటీయూ నాయకులు ఎం.శ్రీనివాసరావు, తిరుపతిరావు పాల్గొన్నారు.



ఎంపీడీఓకు వినతిపత్రాన్ని అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, గ్రీన్ అంబాసిడర్స్

నేడు ట్రైల్ టోర్నమెంట్

పాలకొండ రూరల్: ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించేందుకు చేపడుతున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని పట్టణంలో విజయవంతం చేయాలని నగర కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు అన్నారు. తన కార్యాలయంలో నియోజకవర్గ, మండల క్రీడా నిర్వాహక పర్యవేక్షకులు వి.పుష్పనాథం, ఆర్.రాములు నేతృత్వంలో తొమ్మిది సచివాలయాల అడ్మిన్ సెక్రటరీలతో బుధవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ నెల 15 నుంచి జరగనున్న ఈ క్రీడల నిర్వహణలో భాగంగా గురువారం ప్రతీ సచివాలయ పరిధిలో ట్రైల్ టోర్నీలు చేపట్టాలన్నారు. ఈ ట్రైల్ నిర్వహించే విధివిధానాలపై వ్యాయామోపాధ్యాయులు పలు సూచనలు చేశారు. నేటి ట్రైల్‌రన్ పూర్తి అయిన తరువాత లోటుపాట్లు గుర్తించి వాటిని అధిగమించేలా యతిన్చాలన్నారు.



సమావేశంలో వ్యాయామోపాధ్యాయులు, సచివాలయ అడ్మిన్ సెక్రటరీలు